క్లుప్తంగా

నాణ్యమైన తునికాకు ఇవ్వాలి

డిచ్‌పల్లి: మండల పరిధిలోని శివాజీ బీడీ ఫ్యాక్టరీలో బీడీలు చుట్టే కార్మికులకు నాణ్యమైన తునికాకు ఇవ్వాలని టీయూసీఐ జిల్లా నాయకులు మురళి, కిషన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బీడీ టేకేదార్లతో కలిసి శివాజీ బీడీ కంపెనీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. బీడీ చుట్టే కార్మికులకు కొన్ని నెలలుగా నాసిరకం తునికాకు ఇవ్వడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. వేయి బీడీలకు ఇస్తున్న ఆకు కేవలం 500 బీడీలకు సరిపడా మాత్రమే వస్తుందని, మిగతా 500 బీడీలకు ఆకును కార్మికులు కొనుగోలు చేసి నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన తునికాకు ఇవ్వాలని లేదంటే కార్మికులను సమీకరించి నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. యూనియన్ నాయకులు గణేష్, శ్రీధర్, రఘు, గోవర్ధన్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

‘ఒకే దేశం- ఒకే ఎన్నిక’పై అవగాహన



ఇందల్వాయి: ‘ఒకే దేశం- ఒకే ఎన్నిక’పై బూత్ స్థాయి కార్యకర్తలకు అవగాహన కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ప్రజలందరికీ దీనిపై అవగాహన కల్పించాలని దిశా నిర్దేశం చేశారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు చేసుకోవడం సిగ్గు చేటని కేంద్రం బియ్యం ఇస్తే రాష్ట్రం దాన్ని పంచుతుందని, ప్రతీ రేషన్ షాపులో ప్రధాని మోదీ చిత్రపటం పెట్టాలని వారు డిమాండ్ చేశారు. అర్హులందరికి వెంటనే రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. మండల బీజేపీ అధ్యక్షుడు సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు చిన్ను, మాజీ అధ్యక్షుడు నాయిడి రాజన్న, శ్రీనివాస్ రెడ్డి, రాజలింగం తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ రాష్ట్ర కార్యదర్శిగా సందు ప్రవీణ్



సుభాష్‌నగర్: కన్స్యూమర్ కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా జిల్లాకు చెందిన సందు ప్రవీణ్ నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షుడు ప్రీతి పాండ్యా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని, ఇందుకోసం ఏర్పాటు చేసిన కమిటీలో తనకు చోటు కల్పించడం సంతోషంగా ఉందని సందు ప్రవీణ్ పేర్కొన్నారు. తన నియామకానికి కృషి చేసిన సీసీఐ చైర్మన్ అనంత్ శర్మ, జాతీయ, రాష్ట్ర నాయకులకు ప్రవీణ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

ఆహ్వానపత్రిక అందజేత



ఖలీల్‌వాడి: సంతోషిమాత సాయిబాబా ఆలయ పునఃప్రతిష్ఠాపన మహోత్సవానికి మంగళవారం జిల్లా జడ్జి సునీత కుంచాలను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపూల జగన్‌మోహన్ గౌడ్, సంతోషిమాత సాయిబాబా సేవా సమితి అధ్యక్షుడు పార్శి కాశీనాథ్ గుప్తా, ప్రధాన కార్యదర్శి పటేవార్ శ్రీనివాస్ పాల్గొన్నారు

నీటి సమస్యను పరిష్కరించండి



ఇందల్వాయి: గంగారాం తండాలో నెలకొన్న నీటి ఎద్దడిని పరిష్కరించాలని మండల కేంద్రంలో గ్రామస్తులు ఖాళీ బిందెలతో మంగళవారం నిరసన తెలియజేశారు. మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా అస్తవ్యస్తంగా మారిందని.. ఇకనైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మిమిక్రీ శంకర్‌కు సన్మానం



నిజామాబాద్ రూరల్: ఉగాది సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో సోమవారం మిమిక్రీ కళాకారుల వెల్ఫేర్ అసోసియేషన్, జేసీఐ ఇండియన్ జోన్- 12 సంయుక్తంగా ఇరు రాష్ట్రాల మిమిక్రీ కళాకారుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఇందులో నిజామాబాద్ జిల్లాకు చెందిన సీనియర్ మిమిక్రీ కళాకారుడు శంకర్‌ను గురుమాత మాతృమూర్తి శోభ వేణుమాధవ్, నేరెళ్ల శ్రీనాథ్, మావా అధ్యక్షులు జీవీఎస్. రాజు, ఉపాధ్యక్షులు శివారెడ్డి, కార్యదర్శి రాకేష్‌లు ఘనంగా శాలువా, మెమెంటోలతో సన్మానించారు.

బాలాజీనగర్‌లో సమస్యల తిష్ట

- రోడ్లు, డ్రెయినేజీలు కరువు
- కాలనీలో పాముల బెడద
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



కాలనీలో పెరిగిన కోనోకార్పస్ మొక్కలు



డ్రెయినేజీ లేక ఓపెన్ ప్లాట్‌లో నిలిచిన మురుగునీరు

ఖలీల్‌వాడి : నిజామాబాద్ నగర పాలక సంస్థ రోజురోజుకు విస్తరిస్తోంది. కానీ కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కాలనీలను పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రజాప్రతినిధులు మారుతున్నా కాలనీలలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. నగరంలోని 18వ డివిజన్ గంగాగాయత్రీనగర్‌లోని బాలాజీ నగర్‌లో సమస్యలు తిష్ట వేశాయి. ఈ కాలనీ ఏర్పాటు చేసినప్పటి నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులు రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. దీంతో రోడ్లపైన మురికి నీరు ప్రవహిస్తోంది. వర్షాకాలంలో మురికి నీరు రోడ్లపైకి వచ్చినపుడు కాలనీవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడిన సందర్భాలున్నాయి. ప్రస్తుతం కాలనీలో 100కు పైగా ఇళ్లు నిర్మించుకున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు ఇటువైపు కన్నెత్తి చూడటం లేదు. రాత్రి వేళల్లో పాముల బెడద కూడా ఎక్కువగా ఉంది. రోడ్డు ప్రక్కన మురికికాలువలు, పిచ్చిమొక్కలు ఎక్కువగా ఉండటంతో పాములు కాలనీలోకి వస్తున్నాయని కాలనీవాసులు వాపోతున్నారు. పాముల భయానికి కాలనీవాసులు చందాలు వేసుకుని రోడ్లకు ఇరువైపులా ఉన్న తుంగతో పాటు పిచ్చి మొక్కలను తొలిగించారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీతోపాటు విద్యుత్ సౌకర్యం కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కాలనీ అభివృద్ధి శూన్యం



ఇక్కడ 15 ఏళ్ల నుంచి ఉంటున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడి రారు. కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సమస్య ఉంది. దీంతో పాటు పాములు రావడంతో కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి దృష్టికి సమస్యలను తీసుకువెళ్లాం.

– బోయికాడి కిషన్, విశ్రాంతి ఉద్యోగి, బాపూజీనగర్

మాజీ ప్రధానికి ఘన నివాళులు



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణిదేవి, మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

మోపాల్: నగర శివారులోని బోర్గాం(పి) చౌరస్తాలో ఉన్న మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు విగ్రహానికి హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల ఎమ్మెల్సీ పీవీ సురభి వాణిదేవి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాసర సరస్వతి అమ్మవారి దర్శనానికి వెళ్లి వస్తూ మార్గమధ్యలో నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ నివాసానికి వచ్చారు. ఈసందర్భంగా తేనేటి విందును స్వీకరించారు. అనంతరం సురభి వాణిదేవిని బాజిరెడ్డి గోవర్ధన్ శాలువాతో సత్కరించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈగ సంజీవ్‌రెడ్డి, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు భూపతిరావు, లక్ష్మీనారాయణ భరద్వాజ్, మదన్ దీక్షితులు, రమేష్ కులకర్ణి, అశోక్ కులకర్ణి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా పంచసూక్త పారాయణం



పారాయణం చేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

నిజామాబాద్ రూరల్: రామ నామస్మరణతో కలియుగంలో మోక్షం కలుగుతుందని ప్రముఖ వేద పండితులు గొసాం దత్తు శాస్త్రి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రం సీతారామనగర్ కాలనీలో సీతారామ నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రాహ్మణ వాకర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు రామస్తోత్రం, హనుమాన్ చాలీసా, పంచసూక్త పారాయణాలు నిర్వహించారు. ప్రమోద్ మారుతీ జోషి, న్యాలం శ్రీనివాస్, రమేష్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



కవి సమ్మేళనంలో మాట్లాడుతున్న డీఈవో అశోక్

నిజామాబాద్ రూరల్: ఉగాది పురస్కరించుకుని బోర్గం(పి) లక్ష్మీ గణపతి ఆలయంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అరుణ్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం మహాకవి సమ్మేళనం నిర్వహించారు. జిల్లా విద్యాధికారి పార్శి అశోక్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రవి గాంచని చోట కవి గాంచునని.. లాంటి సామాజిక చైతన్యం కలిగించే కవితలు వర్తమాన కవులు రాయాలని సూచించారు. ఆధ్యాత్మిక కవితల్లో భక్తి వికాసం కలుగుతుందని నిర్వాహకులను అభినందించారు.

కవితా గానం చేసిన కవులను సన్మానించారు. డాక్టర్ కాసర్ల నరేష్ రావు, చింతల శ్రీనివాస్ గుప్తా, దారం గంగాధర్, చంద్రశేఖర్, చెన్న శంకర్, రివర్స్ గేర్ నవీన్, రమణ చేరిన, ఇప్పకాయల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సీఆర్ యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులుగా జగద్వీర్‌రావు

నిజామాబాద్‌నాగారం : ఇటీవల సౌత్ సెంట్రల్ రైల్వే(ఎస్‌సీఆర్) హైదరాబాద్ జోనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ సభ్యులు(జెడ్‌ఆర్‌యూసీసీ)గా రావులపల్లి జగద్వీర్‌రావు నియమితులయ్యారు. రెండేళ్ల కాలం పాటు విధులు ఆయన నిర్వహించనున్నారు. నిజామాబాదు రైల్వే జంక్షన్ భవిష్యత్‌లో ఉత్తర భారతానికి వారధి కాబోతుందని, ప్రయాణికులు, వ్యాపారస్తుల సమస్యలను, రైల్వే స్టేషన్లలో సౌకర్యాల విషయమై సలహాలు ఇస్తే పరిగణనలోకి తీసుకొని సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు.

సన్న బియ్యం పంపిణీ ప్రారంభం

నగరంతో పాటు రూరల్ నియోజకవర్గం పరిధిలోని రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీని మంగళవారం స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం నేతలు మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరికీ కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డులు త్వరలో అందజేస్తుందని చెప్పారు. రేషన్ కార్డులపై సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణనేనని, సన్నబియ్యం వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. – సాక్షి నెట్‌వర్క్



ముదక్‌పల్లిలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్న నిజామాబాద్ ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి



ముల్లంగిలో.. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేశ్‌రెడ్డి



మునిపల్లిలో.. ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ సాయిరెడ్డి



ధర్పల్లిలో .. కాంగ్రెస్ నాయకులు



సిరికొండలో..



ఎల్లారెడ్డిపల్లెలో .. తహసీల్దార్ వెంకట్‌రావు, కాంగ్రెస్ నేతలు



నగరంలోని 40 డివిజన్‌లో .. కాంగ్రెస్ నాయకులు

భూముల వేలం విరమించుకోవాలి



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నిజామాబాద్ అర్బన్: హెచ్‌సీయూలో భూముల వేలాన్ని విరమించుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి విగ్నేష్ డిమాండ్ చేశారు. మంగళవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో హమాల్‌వాడి చౌరస్తాలో నిరసన తెలియజేశారు. ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హెచ్‌సీయూకి చెందిన 400 ఎకరాల భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయడం ఆపాలన్నారు. యూనివర్సిటీకి కేటాయించాలన్నారు అరెస్టు చేసిన విద్యార్థి సంఘం నాయకులను విడుదల చేయాలన్నారు. వర్సిటీ పూర్వ విద్యార్థులైన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఐటీ మినిస్టర్ శ్రీధర్ బాబు భూముల వేలంపై సీఎం రేవంత్ రెడ్డితో చర్చించి నిలిపివేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు దినేష్, ఆజాద్, రాజు, కిరణ్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



మైలారంలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ గంగాధర్

సిరికొండ: మండలంలోని మైలారంలో సిరికొండ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ చెల్లం గంగాధర్ మంగళవారం ప్రారంభించారు. వైస్ చైర్మన్ నర్సయ్య, డైరెక్టర్లు బంగ్ల సంతోష్‌రెడ్డి, చిన్నారెడ్డి, సీఈవో గిరిధర్, మాజీ ఎంపీటీసీ సతీష్, నర్సారెడ్డి, లింబాద్రి, రమేష్, భాస్కర్, పశుపతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీ జవాన్‌కు ఉద్యోగ విరమణ సన్మానం

నిజామాబాద్‌నాగారం: దేశ సరిహద్దులో 24 ఏళ్ల పాటు సేవలు అందించి ఉద్యోగ విరమణ పొందిన శాంసన్‌ను తన చిన్ననాటి మిత్రులు మంగళవారం ఘనంగా సన్మానించారు. రైల్వేస్టేషన్ నుంచి ఊరేగింపుగా తీసుకొని నగరంలోని రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో శాంసన్ దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మిత్రులు మాజీ కార్పొరేటర్ న్యాలం రాజు, బుస్సాపూర్ శంకర్, చంద్రశేఖర్, ప్రసన్న కిషన్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్మీ జవాన్ శాంసన్‌తో ఆయన మిత్రులు

సబ్బండ వర్గాల అభ్యున్నతే లక్ష్యం



మాట్లాడుతున్న రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి



వినతి పత్రం అందిస్తున్న గౌరారం గ్రామస్తులు

- ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది
- సన్నబియ్యం పథకం ప్రారంభోత్సవంలో రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నిజామాబాద్ రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్రంలో సబ్బండ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం రూరల్ మండలంలోని మల్లారంలో తెల్ల రేషన్ కార్డు ఉన్నవారికి సన్నబియం పథకాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్ల సీఎంగా ఉన్న కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని విమర్శించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ అప్పుల రాష్ట్రంగా మార్చి రాష్ట్ర అభివృద్ధి కల్వకుంట్ల కుటుంబాభివృద్ధిగా చేసుకున్నారన్నారు. మహిళా స్వశక్తి పేరుపై రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల రుణాలు మహిళ సంఘాలకు జీరో వడ్డీతో ఇచ్చినట్లు తెలిపారు. దేశంలో ఇందిరమ్మ రాజ్యం తిరిగి రావాలని మహిళలకు పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సులు మంజూరు చేశామని, ఇందిరమ్మ ఇల్లు, కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తున్నామన్నారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ అధికారంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని గుర్తు చేశారు. సన్నాలకు బోనస్ రూ.500 ఇస్తున్న ప్రభుత్వం మాదేనన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బాగిర్తి బాగారెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాలువలకు నిధులు మంజూరు చేయాలి

ఇందల్వాయి : గౌరారం వాగులో ఉన్న మత్తడితో పాటు, చెరువులోకి నీరు వచ్చే మాటు కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని గ్రామస్తులు ఎమ్మెల్యే భూపతి రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడారు. త్వరలో నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామి ఇచ్చారు. సంతోష్ రెడ్డి, దత్తు, దాసు, ప్రవీణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికం..

మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం



డిచ్‌పల్లి : మండలంలో ప్రసిద్ధి చెందిన ఘన్పూర్ గ్రామ శ్రీమహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో రేఖ చంద్రసేనా, తడకమడ్ల శ్రీనివాస్, రేఖ రాము, శ్రీనివాస్, సితంబర్, ఘన్‌పూర్‌తో పాటు, చుట్టు పక్కల గ్రామాల భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

విగ్రహాల ప్రాణప్రతిష్ఠ ఉత్సవం



నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని ఇస్కాన్ ఆలయంలో దయాల్ నీతాయి గౌరంగా విగ్రహాల ప్రాణప్రతిష్ఠ ఉత్సవం మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ప్రణవానంద దాస్, ప్రేమ్ నర్తన దాస్ ప్రభు హాజరై మాట్లాడారు. భగవంతుని ప్రేమ స్వరూపాన్ని వివరించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు రామానందరాయ(ఇస్కాన్ కంఠేశ్వర్ అధ్యక్షులు) ప్రభూజీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.



పెద్దహనుమాన్ విగ్రహం వద్ద భక్తులకు అన్నదానం



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న పూజారి

బంజారా దీక్షాదారులకు అన్నదానం

నిజామాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ రుక్మిణీ చాంబర్స్ ఎదుట పెద్ద హనుమాన్ విగ్రహం వద్ద సద్గురు రామ్‌రావ్ మహరాజ్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం సేవాలాల్ దీక్షధారులకు మహాఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. బంజార డాక్టర్ బిలోజీ నాయక్, లోక్యా నాయక్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉన్న బంజారా డాక్టర్‌లు అన్నధాన కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించారు. బంజారా దీక్షధారులు మాట్లాడుతూ.. గత శివరాత్రి పర్వదినం నుంచి మొదలుకొని వచ్చే శ్రీరామ నవమి వరకు మాలధారులు అత్యంత నిష్ఠతో 41 రోజుల కఠోర దీక్షను చేపడతారని అన్నారు. జితేందర్ మహారాజ్, జిల్లా గిరిజన ఆదివాసి చైర్మన్ యాదగిరి నాయక్, ఐడీఎంఎస్ చైర్మన్ తారాచంద్‌నాయక్, ఐబీబీఎస్ఎస్ అధ్యక్షుడు చంద్రానాయక్ , డాక్టర్ మోతిలాల్, లక్ష్మణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	92,600	వెండి(కిలో)	1,05,500
22 క్యారెట్స్	83,470		

– నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	140
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	16	గాజరుగడ్డ	30	50
బెండకాయ	40	60	పచ్చిమిర్చి	40	60
బీరకాయ	50	70	దోసకాయ	30	50
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	30	50	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	15	30
వంకాయ	12	24	బీట్‌రూట్	20	40
పాలకూర	20	40	కరివేపాకు	70	120
మెంతికూర	30	50	చామగడ్డ	50	70
కొత్తిమీర	20	40	గోరుచిక్కుడు	60	80
పుదీనా	30	50	చిక్కుడుకాయ	60	80
క్యాప్సికం	35	60			

– సుభాష్‌నగర్

సినిమాలు

ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1 మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-10.45, 1.20, 4.20, 7.20, 10.20
- స్క్రీన్-2 వీర ధీర శూరన్(తెలుగు)-10.50, 7.40
  రాబిన్‌హుడ్(తెలుగు)-1.40
  ఎల్-2 ఎంపురాన్(తెలుగు)-4.20, 10.30
- స్క్రీన్-3 వీర ధీర శూరన్(తెలుగు)-1.30
  రాబిన్‌హుడ్(తెలుగు)-4.30, 7.30, 10.20

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1 రాబిన్‌హుడ్(తెలుగు)-10.10, 1.20, 4.30, 7.40, 10.50
- స్క్రీన్-2 ఎల్-2 ఎంపురాన్(తెలుగు)-10.10
  కోర్ట్(తెలుగు)-1.45
- స్క్రీన్-3 వీర ధీర శూరన్-పార్ట్-2 -10.05, 4.10, 7.30, 10.50
  మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-1.25
- స్క్రీన్ -4 మ్యాడ్ స్క్వేర్(తెలుగు)-10.00
  ఎల్-2 ఎంపురాన్ -12.45, 7.25, 11.00
  కోర్ట్(తెలుగు)-4.20

లలితామహల్ కోర్ట్, దేవి రాబిన్‌హుడ్

నటరాజ్ షణ్ముఖ, విజయ్ మ్యాడ్ స్క్వేర్